క్లుప్తంగా

రూ.1.13 కోట్లతో మన ఊరు - మన బడి పనులు

నడిగూడెం : మండల పరిధిలోని పలు గ్రామాల్లో రూ.1.13 కోట్లతో మన ఊరు-మన బడి పనులు జరుగుతున్నట్లు ఎంపీడీఓ యం.యర్రయ్య తెలిపారు. శనివారం నడిగూడెంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పలు ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల్లో బాలురు, బాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. త్వరలోనే పనులు పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు.

కోదాడలో 'డబుల్' ఇళ్ల పంపిణీకి నేడు డ్రా

కోదాడ : పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో ప్రభుత్వం నిర్మించిన 560 డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీకి ఆదివారం డ్రా తీసి లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించనున్నట్లు అధికారులు తెలిపారు. కోదాడలోని కట్టకొమ్ముగూడెం రోడ్డులో ఉన్న పెరిక హాస్టల్‌లో డ్రా తీసేందుకు ఏర్పాట్లు చేసినట్లు దరఖాస్తుదారులు ఉదయం 8 గంటలకు అక్కడకు చేరుకోవాలని కోరారు.

రాష్ట్ర సమావేశాన్ని జయప్రదం చేయాలి

చిలుకూరు : కరీంనగర్‌లో ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించబోయే సీపీఐ అనుబంధ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ విస్తృత స్థాయిలో సమావేశంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రెమిడాల రాజు, ధనుంజనాయుడు కోరారు. శనివారం చిలుకూరులో విలేకరులతో మాట్లాడారు. కార్మిక సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు.

తహసీల్దార్‌కు సన్మానం

హుజూర్‌నగర్ : ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకుని సెలవుల అనంతరం తిరిగి విధులకు హాజరైన తహసీల్దార్ జయశ్రీని శనివారం వైఎస్సార్‌టీపీ నాయకులు పూలమాలతో సన్మానించి, పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసరావు, నాయకులు టి.శ్రీనివాస్, జి.జ్యోతి, డీటీ సంధ్యారాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మునగాల : మండలంలోని ముకుందాపురం శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో శనివారం ఆకుపాముల గ్రామానికి చెందిన పోలంపల్లి పాపారావు-రోహిణి దంపతుల కుమారుడు జైనీష్ జన్మదినం సందర్భంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో పోలంపల్లి వెంకటేశ్వర్లు - వెంకటమ్మ, ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ, బీసీ విద్యార్థి సంఘం నాయకులు పోలంపల్లి ఉపేందర్, నరేష్, నాగరాజు, కురాట్ల ఉపేందర్, పరుశరాం, సాయికుమార్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో కామాటీ మృతి

నడిగూడెం : మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కామాటీగా పని చేస్తున్న లంజపల్లి లింగయ్య (45) గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. మృతునికి భార్య, కొడుకు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. లింగయ్య అకాల మృతి పట్ల వార్డు సభ్యురాలు దున్నా శరణమ్మ, నాగరాజు, పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ఈదురు గాలులతో వర్షం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో శనివారం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మబ్బులతో ఉండి మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. వర్షంతో పాటు ఈదురుగాలులు రావడంతో పలు చోట్ల ఫ్లెక్సీలు, బ్యానర్‌లు కింద పడిపోయాయి.

తల్లిదండ్రుల సమావేశం

నడిగూడెం : పిల్లల చదువు పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యలమర్తి శౌరి కోరారు. శనివారం ఆ పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రుల ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు, శారీరక, మానసిక, అభివృద్ధి పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆ పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ మల్లేష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా సహస్రనామ ఫల పుష్పార్చన



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో పాల్గుణమాసం బహుళ ఏకాదశి సందర్భంగా సహస్రనామ ఫల పుష్పార్చన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన, అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, సేవాకాలం, అలంకరణ, మంగళాశాసనం, కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎంపీ లక్ష్మణరావు, బోనాల శ్రీనివాసరావు, చంద్రకళ, అర్చకుడు హరీష్‌కుమార్‌చార్యులు, భక్తులు పాల్గొన్నారు.

నిర్మించారు.. పంపిణీ మరిచారు

- డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం ఆశగా ఎదురుచూస్తున్న పేదలు
- మౌలిక సదుపాయాల కల్పనలో జాప్యం చేస్తున్న అధికారులు



విభళాపురంలోని డబుల్ బెడ్ రూం ఇళ్లు

మోతె : పేదోడి సొంతింటి కల కలగానే మిగిలిపోతోంది. మండలంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తైనా పంపిణీకి మాత్రం నోచుకోవడం లేదు. ఇళ్ల నిర్మాణాలు పూర్తై ఏళ్లు గడుస్తున్నా అక్కడ మౌలిక వసతులు కల్పించి పేదలకు పంపిణీ చేయాలన్న విషయాన్ని అధికారులు మరిచారా అన్న సందేహం కలుగుతోంది.

కలెక్టర్ ఆదేశాలు..

అయితే మోతె, విభళాపురం గ్రామాల్లో లబ్ధిదారుల దాదాపుగా ఎంపిక పూర్తైంది. అప్పన్నగూడెం గ్రామంలో లబ్ధిదారుల ఎంపికలో కొంత జాప్యం జరిగింది. కాగా గత వారం రోజుల క్రితం జిల్లా కలెక్టర్ మోతె మండలాన్ని విజిట్ చేసి విభళాపురం గ్రామంలో డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలించారు. మండలంలో డబుల్ బెడ్ రూం ఇళ్లు పూర్తైన తర్వాత ఎందుకు పంపిణీ చేయలేదని స్థానిక తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు తక్షణమే లబ్ధిదారులకు పంపిణీ చేయుటకు జాబితా తయారు చేయాలని ఆదేశించారు.

210 ఇళ్లు మంజూరు..

కాగా, 2017లో మండల కేంద్రంలో 90 డబుల్ బెడ్ రూం ఇళ్లు, అప్పన్నగూడెంలో 40, విభళాపురం గ్రామంలో 40, నామవరం గ్రామంలో 40 ఇళ్లు మంజూరయ్యాయి. దీంతో మోతె, విభళాపురం, అప్పన్నగూడెం గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల మంజూరుకు గత సంవత్సరం నవంబర్ నెలలో సూర్యాపేట ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ సమక్షంలో 144 ఇళ్లకు లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఎంపికైన లబ్ధిదారులకు మాత్రం నేటికీ ఇళ్లు అప్పగించలేదు. కాగా నామవరం గ్రామంలో ఇప్పటికీ ఇళ్లు నిర్మించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పూర్తైన డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద త్వరితగతిన వసతులు కల్పించి పంపిణీ చేయాలని కోరుతున్నారు.

గుడిసెల్లో బతుకుతున్నాం

మోతెలో పెద్దమ్మల కులానికి చెందిన సుమారుగా 50 కుటుంబాలకు పైగా కడు నిరుపేదలం చీరెలతో కట్టిన డేరాల్లో, గుడిసెల్లో జీవనం సాగిస్తున్నాం. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలికి వనుకుతూ పూరి గుడిసెల్లో బతుకుతున్నాం. వర్షాలకు కురుస్తున్న గుడిసెలపై హరిగోస పడుతున్నాం.

– సంతోషమ్మ, మోతె

నిధులొచ్చాక పనులు ప్రారంభిస్తాం

మోతె, విభళాపురం, అప్పన్నగూడెం గ్రామాల్లో 144 డబల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అక్కడక్కడ చిన్న చిన్న పెండింగ్ పనులు జరుగుతున్నవి. రోడ్లు, డ్రైయినేజీ, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయల కల్పనకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించి పూర్తిచేస్తాం.

– రంగారావు, పీఆర్ ఏఈ, మోతె

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



చిలుకూరు : ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

చిలుకూరు : నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. శనివారం చిలుకూరు హరిజనవాడలో సత్తెమ్మ తల్లి, ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం దేవాలయాలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా హరిజనవాడకు చెందిన పలువురు హోమం, పూజలు నిర్వహించారు. నవ ధాన్యాలు సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొడారు బాబు, ఎంపీటీసీలు బెల్లంకొండ రమణ నాగయ్య, వడ్డేపల్లి కళ్యాణికోటేష్, నాయకులు పిల్లుట్ల శ్రీనివాస్, కందుకూరి ఉపేందర్, ముత్యాలు, వెంకటి, పిచ్చయ్య, సూరిబాబు, రామకృష్ణ, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కోదాడరూరల్ : మండల పరిధిలోని రెడ్లకుంటలో నూతనంగా నిర్మిస్తున్న గంగమ్మ, లింగమంతులస్వామి ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో శనివారం ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి తనవంతు సహకరిస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చింత కవితారాధారెడ్డి, సర్పంచ్ సాధినేని లీలాఅప్పారావు, మల్లెల పుల్లయ్య, చిర్రా ముత్తయ్య, సతీష్, నిరంజన్, పిచ్చయ్య, సత్యనారాయణ ఉన్నారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



కనకదుర్గమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

గరిడేపల్లి : ఆధ్యాత్మికతను ప్రజలందరూ అలవర్చుకోవాలని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి కోరారు. శనివారం మండల పరిధిలోని కీతవారిగూడెంలో నూతనంగా నిర్మించతలపెట్టిన కనకదుర్గమ్మ, అంకమ్మ, మారమ్మ, మద్దిరావమ్మ ఆలయాల పునర్నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ కీత జ్యోతిరామారావు, మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటరెడ్డి, నాగరాజు, సైదులు, అంజి, సాయి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మత్స్య సొసైటీ ఎన్నికలో అవకతవకలు



సమావేశంలో మాట్లాడుతున్న వీరబాబు

మునగాల : మండలంలోని కలకోవలో ఈనెల 14న జరిగిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలో అవకతవకలు జరిగినట్లు ఆ గ్రామానికి చెందిన బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి వీరబాబు, మాజీ సర్పంచ్ చిర్ర శ్రీనివాస్ ఆరోపించారు. శనివారం కలకోవలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ ఎన్నికలను బహిష్కరించిందని సీపీఎం ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సీపీఎం నాయకులు తాము 9 మంది డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని ప్రకటించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఏకగ్రీవంగా ఎన్నుకున్న డైరెక్టర్లలో సురభి సైదమ్మ అనే మహిళ గ్రామంలో అంగన్‌వాడీ ఆయాగా విధులు నిర్వర్తిస్తుందని, మరి సంఘం డైరెక్టర్‌గా ఏ విధంగా కొనసాగుతారని, ఈ విషయమై తాము ఐసీడీఎస్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అలాగే మరో మహిళా డైరెక్టర్‌గా సాల పద్మ మునగాల గ్రామానికి చెందిన వ్యక్తి అని వివరించారు. ఇతర గ్రామానికి చెందని మహిళను ఏ విధంగా ఎన్నుకుంటారని ప్రశ్నించారు. సొసైటీ బైలా ప్రకారం ఈ రెండు డైరెక్టర్ పదవుల ఎన్నికకు సంబంధించి ఆధారాలతో తాము అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. గత 25 ఏళ్లుగా సంఘాన్ని సీపీఎం పార్టీ నాయకులు తమ గుప్పెట్లో ఉంచుకొని బోగస్ సభ్యులతో అవినీతికి పాల్పడుతూ కోట్ల రూపాయలు వెనకవేసుకొని అనవరంగా ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యపై వ్యక్తిగత దూషణలు, ఆరోపణలు చేయడం సమంజసం కాదని హితవు పలికారు. జిల్లా అధికారులు విచారణ చేపట్టి అనర్హులైన సభ్యులను తొలగించి కొత్త సభ్యత్వాలు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో పనస వీరయ్య, బచ్చు శ్రీను, మోదాల రామకృష్ణ, కొంపెల్లి వెంకటేశం పాల్గొన్నారు.

పథకాల అమలుపై సమాచారమివ్వాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల డిమాండ్



మాట్లాడుతున్న ఎంపీపీ లకుమళ్ల జ్యోతి

నేరేడుచర్ల : నేరేడుచర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లకుమళ్ల జ్యోతి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరుపై తమకు సమగ్ర సమాచారం అందించాలని ప్రజాప్రతినిధులు అధికారులను డిమాండ్ చేశారు. అలాగే మండల వైద్యాధికారి సెలవులో ఉండటంతో హెల్త్ సూపర్‌వైజర్ వరమ్మ ఆరోగ్య కేంద్రంలో చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తుండగా పెంచికల్‌దిన్న ఎంపీటీసీ లింగయ్య కంటి వెలుగు కార్యక్రమ వివరాలు నివేదికలో ఎందుకు పొందుపరచలేదని నిలదీశారు. ఈ విషయంపై స్పందించిన ఎంపీడీఓ శంకరయ్య ప్రజాప్రతినిధులు సమాచారం అడిగితే ఇవ్వాల్సిన బాధ్యత సంబంధిత అధికారిపై ఉందన్నారు. వైద్య సిబ్బంది సమావేశానికి కంటి వెలుగు పురోగతిపై సమగ్ర నివేదిక అందించాలన్నారు. తహసిల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో 26 రేషన్ దుకాణాలు ఉన్నాయని, ఖాళీగా ఉన్న ఐదు చోట్ల నూతనంగా డీలర్లను నియమించినట్లు తెలిపారు. ఇటీవల కొక్కిరే రోగంతో నాటు కోళ్లు చనిపోయాయని, త్వరలోనే వ్యాక్సిన్ పంపిణీ చేస్తామని పశువైద్యాధికారి రవినాయక్ పేర్కొన్నారు. అనంతరం నూతనంగా నేరేడుచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన నాగండ్ల శ్రీధర్‌ను ఎంపీడీఓ ప్రజాప్రతినిధులు, అధికారులకు పరిచయం చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ తాళ్లూరి లక్ష్మీనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు తదితరులున్నారు.

ఢిల్లీకి తరలివెళ్లిన రైతు కూలీ సంఘం నాయకులు

గరిడేపల్లి : అఖిల భారత రైతు కూలీ సంఘం సీపీఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ) ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగే ధర్నాకు శనివారం ఆ సంఘం నాయకులు, కార్యకర్తలు వెలిదండ గ్రామం నుంచి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను పట్టించుకోకుండా దోబూచులాడుతున్నాయని, అనేక మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడితే పాలక ప్రభుత్వాలకు కనబడటం లేదా అని ప్రశ్నించారు. రైతులు, రైతు కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ ధర్నా చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కామల్ల శ్రీను, తాళ్లూరి లోకాస్, తిరుపతయ్య, అచ్చయ్య, కోటయ్య, అంజయ్య తదితరులున్నారు.

కళా ప్రపూర్ణ అవార్డుకు నరేష్‌చారి ఎంపిక



కోదాడఅర్బన్ : విశ్వకర్మ పీఠం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా కవులు, కళాకారులకు అందజేస్తున్న అవార్డులలో భాగంగా కోదాడకు చెందిన సూక్ష్మ కళాకారుడు వెగ్గలం నరేష్‌చారి కళా ప్రపూర్ణ అవార్డుకు ఎంపికైనట్లు ట్రస్ట్ చైర్మన్ ఎస్ఎస్ మల్లేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న గుంటూరు జిల్లా చుట్టుగుంటలో పోలేరమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఈ అవార్డును అందజేస్తున్నట్లు తెలిపారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలను దేశం నలుమూలల విస్తరింపజేస్తున్న వ్యక్తులను ఎంపిక చేసి ఈ అవార్డులు అందజేసి సత్కరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా సూక్ష్మ కళలో రాణిస్తున్న నరేష్‌చారి గతంలో అనేక అవార్డులు పొందారు. నరేష్ చారి కళాప్రపూర్ణ అవార్డుకు ఎంపిక కావడం పట్ల పలువురు ఆయనను అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

ఆలయ నిర్మాణం సంతోషకరం

- మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



మేళ్లచెరువు : వెల్లటూరులో నర్సింహ విగ్రహం ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతి

కోదాడరూరల్ : మండల పరిధిలోని రెడ్లకుంటలో లింగమంతులస్వామి ఆలయ నిర్మాణానికి తనవంతు సహకరిస్తానని మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. శనివారం ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామస్తులు కలిసికట్టుగా ఆలయాన్ని నిర్మించుకోవడం సంతోషకరమన్నారు. అదేవిధంగా ఎర్రవరంలో నూతనంగా నిర్మిస్తున్న బాల ఉగ్ర నరసింహస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రేవూరి వెంకటాచారి, లక్ష్మణ్‌రావు, నాగేశ్వరరావు, నలజాల జగన్నాథం తదితరులు ఉన్నారు.

నర్సింహ విగ్రహం ఆవిష్కరించిన పద్మావతి

మేళ్లచెరువు : మండలంలోని వెల్లటూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాజీ సర్పంచ్ రౌతు అంతయ్య తండ్రి నర్సింహ విగ్రహాన్ని కోదాడ మాజీ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ రాజశేఖర్

హుజూర్‌నగర్ : విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ బి.రాజశేఖర్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన ఎండీఆర్ హైస్కూల్ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్చుకోవాలని, మంచి అలవాట్లు కలిగి ఉండాలని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు, వివిధ తరగతుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ధ్రువపత్రాలు, మెమెంటోలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ సైదానాయక్, డాక్టర్ రాకేష్‌కుమార్, చైర్మన్ మేరెడ్డి దామోదర్‌రెడ్డి, హెచ్ఎం భూపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



నేరేడుచర్ల : స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



గరిడేపల్లి : చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో..

నేరేడుచర్ల : మండలంలోని దాచారం గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాయిని సుధాకర్, ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, బుర్రి పుల్లయ్య, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

చైతన్య స్కూల్‌లో..

గరిడేపల్లి : మండల కేంద్రంలోని చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.సుజాతావెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బల్లకట్టుకు అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలి



బల్లకట్టును పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : బల్లకట్టుకు అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం చింతలపాలెం మండలంలోని చింత్రియాల వద్ద కృష్ణానదిపై నడిపే బల్లకట్టును ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్, బల్లకట్టు పర్మిషన్, ఇన్సూరెన్స్ పత్రములు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని ధ్రువపత్రాలతో నిబంధనల ప్రకారం నడపాలన్నారు. బల్లకట్టు నిర్వాహకులు తప్పనిసరిగా సేఫ్టీ జాకెట్ ధరించాలని సూచించారు. బల్లకట్టు నిర్వహణకు ఈనెల 25న జెడ్పీ కార్యాలయంలో సీఈఓ సమక్షంలో బహిరంగ వేలం ఉంటుందని, ఆసక్తి గల వారు వివరాల కోసం జెడ్పీ సీఈఓ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు. అంతకుముందు చింత్రియాల ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట పలువురు నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్ల గౌరవ వేతనం పెంపుపై హర్షం



గొంగిడి మహేందర్‌రెడ్డిని సత్కరిస్తున్న దయాకర్‌రెడ్డి, తదితరులు

కోదాడఅర్బన్ : రాష్ట్రంలోని పీఏసీఎస్ చైర్మన్ల గౌరవ వేతనం పెంపుపై హర్షం వ్యక్తం చస్తూ, పెంపుకు కృషి చేసిన టెస్కాబ్ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిని శనివారం ఆయన కార్యాలయంలో పీఏసీఎస్ చైర్మన్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, అధికార ప్రతినిధి ఆవుల రామారావుల ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్‌లు పాశం సంపత్‌రెడ్డి, గుంటక వెంకటరెడ్డి, మల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, ఎల్గూరి పల్లపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోమియోపతితో దీర్ఘకాలిక వ్యాధులకు చెక్



హోమియో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఐవిరెడ్డి విద్యా సంస్థల చైర్మన్ ఎస్ఎస్‌రావు, వైద్యులు

కోదాడఅర్బన్ : హోమియోపతి మందులతో దీర్ఘకాలిక రోగాలకు చెక్ పెట్టవచ్చని ఐవిరెడ్డి విద్యా సంస్థల చైర్మన్ ఎస్ఎస్‌రావు అన్నారు. శనివారం పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో గల సంపూర్ణ వైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాగా శిబిరంలో వంద మంది రోగులను పరీక్షించి ఉచిత చికిత్స చేశారు. రోగులకు రూ. 30 వేల విలువ గల హోమియో మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు టి.పూర్ణచంద్రుడు, ఎస్.సంయుక్తరాణి, బి.వాసవి, డి.లావణ్య, నిర్వాహకులు రామకృష్ణ దంపతులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు రాయపూడి వెంకటనారాయణ, డాక్టర్ సుధీర్, కోదాడ రచయితల సంఘం అధ్యక్షుడు పుప్పాల కృష్ణమూర్తి, రచయితలు రాజా, అధ్యాపకులు ఎస్.రమేష్, భువనేశ్వరి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీ వారికే కేటాయించడం సరికాదు

నేరేడుచర్ల : అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేవిధంగా చూడాలని బీఎస్పీ పట్టణ అధ్యక్షుడు కర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం నేరేడుచర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేరేడుచర్ల మున్సిపాలిటీలో ఖాళీ అయిన రేషన్ దుకాణాలను అర్హులైన వారికి కాకుండా అధికార పార్టీకి చెందిన వారికి కేటాయించడం సరి కాదన్నారు. మున్సిపాలిటీలో మైనార్టీ కార్పొరేషన్ రుణాలు కూడా అధికార పార్టీకి చెందిన వారికే వస్తాయని ప్రజలు బహిరంగంగా చెప్పుకుంటున్నారని అన్నారు. అర్హులైన వారందరిని ఆయా పథకాలకు దరఖాస్తు చేసుకొమ్మని చెప్పి మంజూరు విషయంలో మాత్రం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో బీఎస్పీ నాయకులు నాగార్జున, పోలే వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


టీబీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

హుజూర్‌నగర్ : టీబీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని కౌన్సిలర్ జక్కుల శంభయ్య, ఏఎస్ఎం మాధవి అన్నారు. శనివారం పట్టణంలోని మల్లన్ననగర్‌లో జన ఆరోగ్య సమితి ఆధ్వర్యంలో వివిధ వ్యాధులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. వారం రోజులుగా దగ్గు వస్తున్నవారు టీబీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం వైద్యులు గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు టీకాలు వేశారు. షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులకు ఎన్‌సీడీ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది జరీనాబేగం, అంగన్‌వాడీ టీచర్ శాంతరాజ్యం, నాయకులు సాయిరాం, సైదులు, చుక్కయ్య, అర్చనాదేవి తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌సీడీ కిట్లు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ శంభయ్య

పంటనష్టం చెల్లించాలి



చెన్నాయిపాలెం వద్ద పంట పొలాలను పరిశీలిస్తున్న గిరిజనులు

మఠంపల్లి : మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షం, ఈదురు గాలులకు చేతికొచ్చిన పంట పొలాలు వరదనీటి పాలవుతున్నాయని, దీంతో తమకు తీవ్ర నష్టం వాటిల్లిందని ప్రభుత్వం పంటనష్టం చెల్లించి ఆదుకోవాలని పలువురు గిరిజనులు శనివారం కోరారు. ముఖ్యంగా చెన్నాయిపాలెం, కిందితండా, మంచ్యాతండా తదితర గ్రామాల పరిధిలో వర్షాలకు వాగులు పొంగి వరద నీటిలో వరి పొలాలు మునిగిపోయాయని తెలిపారు. పంటనష్టం చెల్లించడంతో పాటు, తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. గిరిజన నాయకులు, రైతులు మాలోతు వీరన్న నాయక్, లకుపతినాయక్, లచ్చు నాయక్, మహేష్‌బాబు, ఠాగూర్‌నాయక్, పూల్‌సింగ్, చిన్నానాయక్, తదితరులున్నారు.

పేపర్ లీకేజీ కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి

హుజూర్‌నగర్ : టీఎస్ పీఎస్సీ పరీక్ష పత్రాల లీకేజీకి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో సూర్యాపేట కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాకు శనివారం హుజూర్‌నగర్ నుంచి బయలు దేరారు. బీజేపీ నాయకులు అబ్బాస్, సతీష్, యల్లయ్య, ఎం.వెంకటేశ్వర్లు, ఉమామహేశ్వరరావు, శ్రీను, సోమయ్య, నరసింహ, వీరారెడ్డి, అమరయ్య, నాగలక్ష్మి, వీరబాబు, గోపాల్, బాలు, శంబిరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే పేదల అభ్యున్నతి

మునగాల : టీడీపీ హయాంలోనే పేదల అభ్యున్నతి జరిగిందని టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఓరుగంటి ప్రభాకర్ అన్నారు. టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఆదేశానుసారం శనివారం మండలంలోని నర్సింహులగూడెంలో చేపట్టిన ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు పెద్ది నర్సయ్య, చిలుకూరు వైస్ ఎంపీపీ జనపనేని జానకి కృష్ణారావు, సాతులూరి గుర్వయ్య, కొల్లు నర్సయ్య, అశోక్, శ్రీనివాసరెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.